సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 23 । మే । 2024



సొమ్ము నొక్కి.. వలకు చిక్కి..

కాకినాడ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.మురళి అవినీతి నిరోధక శాఖ అధికారులకు బుధవారం రాత్రి చిక్కారు. ఐస్ ఫ్యాక్టరీకి సబ్సిడీ సొమ్ములు విడుదలకు లంచం డిమాండ్ చేస్తూ పట్టుబడ్డారు.

8లో



కిలో చికెన్ @ ట్రిపుల్ సెంచరీ

మాంసాహార ప్రియులకు చేదువార్త ఇది.. కిలో చికెన్ ధర 'ట్రిపుల్' సెంచరీ దాటింది.. గుడ్డు ధరా అంతకంతకూ 'ఎగ్'బాకుతోంది..

గరిష్టం/కనిష్టం 39.0°/27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.0	27.0
కాకినాడ	36.0	28.0
అమలాపురం	39.0	28.0

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్స్‌లో ఈవీఎం యూనిట్స్ భద్రం



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పహరా కాస్తున్న సాయుధ బలగాలు

రాజానగరం: జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలైన ఓట్లను జూన్ 4 లెక్కించే వరకు ఈవీఎం యూనిట్లను గట్టి బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరచిన వీటిని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత, జిల్లా ఎస్పీ పి.జగదీష్, తదితర అధికారులు తరచు పరిశీలిస్తూ భద్రతను పర్యవేక్షిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘాలో 24 గంటలూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కి అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతానికి ఒక కిలోమీటరు దూరంలో సెక్షన్ 144 (సి), సీఆర్‌పీసీ కింద విధులు నిర్వర్తించే అధికారులు మినహా ఇతరులెవ్వరూ గుంపులుగా ఉండటం, సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమని రిటర్నింగ్ అధికారి కె.మాధవీలత తెలిపారు. ఎవరైనా ఉల్లంఘిస్తే భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 188 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పరిసర గ్రామాలలో కూడా మైకు ద్వారా ప్రచారం చేయిస్తున్నారు.

డీఈఈ సెట్‌కు ఏర్పాట్లు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : మే 24 నుండి నిర్వహించే డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ) సెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని, అదే రోజున పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు కూడా ప్రారంభం కానున్న దృష్ట్యా అధికారులు పూర్తి సమన్వయంతో కలిసి పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు అధికారులకు సూచించారు. బుధవారం డీఆర్‌వో చాంబర్‌లో డీఈఈ సెట్, పదో తరగతి, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 24న ఒకరోజు డీఈఈ సెట్‌ను రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 539 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మే 24 నుంచి జూన్ 3 వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 44 కేంద్రాల్లో 9,230 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని నరసింహులు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఆర్‌వో జి. నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వో చాంబర్‌లో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డీఆర్వో నరసింహులు జిల్లా కమిటీ సభ్యులు, విద్యా, రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, ఏపీఎస్ ఆర్‌టీసీ, పోస్టల్ అధికారులతో సమీక్షించారు.

లెక్క ఆత్రం!

- పక్షం రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- అభ్యర్థుల్లో నరాలు తెగే ఉత్కంఠ
- దగ్గరపడుతోన్న ఓట్ల లెక్కింపు
- గెలుపు ఓటములపై ఎవరి అంచనాల్లో వారు
- గత ఫలితాల పునరావృతంపై వైఎస్సార్ సీపీ ధీమా



ద్రాక్షారామ మండాలమ్మపేటలో ఫలితాలపై లెక్కలేస్తున్న స్థానికులు



సాక్షిప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక సమరంలో చివరి అంకం ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ మొదలైంది. అభ్యర్థులంతా గెలుపు ధీమాతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఫలితాల సమయం దగ్గరపడే కొద్దీ బరిలో ఉన్న ప్రధాన ప్రత్యర్థులు నరాలు తెగే ఉత్కంఠను ఎదుర్కొంటున్నారు. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన అనంతరం అభ్యర్థులంతా ఎన్నికల్లో పెట్టిన ఖర్చులపై లెక్కలు వేసుకుంటూ నిన్నమొన్నటి వరకూ బిజీగా గడిపారు. పోలింగ్ ముగిసి, ఓట్ల లెక్కింపునకు మధ్య ఉన్న సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడొంతులు మంది అభ్యర్థులు టూర్‌లకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఎందుకనో అభ్యర్థులు టూర్‌లకు వెళ్లడంపై అంతగా ఆసక్తి కనబరచలేదు. ఇందుకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి.

పెరిగిన ఓటింగ్.. అధికార పార్టీ ధీమా

గతానికి భిన్నంగా ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో పెరిగిన ఓటింగ్ తమకు ప్లస్ అంటే తమకు ప్లస్ అవుతుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. కాకినాడ జిల్లాలో 83.65 శాతం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 83.84 శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 79.43 శాతం పోలింగ్ నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు మించి ఈసారి ఎన్నికల్లో పోలింగ్ నమోదైంది. 2019లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారాన్ని చేపట్టాక నాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా ప్రకటించిన పథకాలన్నింటినీ క్రమం తప్పకుండా గడచిన ఐదేళ్ల కాలంగా అమలుచేస్తూ వచ్చారు. పథకాలను పార్టీ, రాజకీయం, కులం, మతం చూడకుండా పూర్తి పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా అందజేశారు. నిజంగా మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఓటేయండని ధైర్యంగా ప్రజలను ఓటడిగిన ముఖ్యమంత్రి తీరు అన్ని వర్గాలపై బలమైన ముద్ర వేసింది. పోలింగ్ రోజు క్యూ లలో గంటల తరబడి నిలుచుని చివరకు అర్ధరాత్రి అయినా లెక్క చేయకుండా మహిళలు సైతం ఓట్లు వేశారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో ప్రజలు అంతసేపు వేచి చూసి ఓట్లేయలేదంటున్నారు. ఓటింగ్ సరళిని నిశితంగా గమనిస్తే తమకు మంచి చేసిన వైఎస్సార్ సీపీని కచ్చితంగా గెలిపించుకోవాలనే బలమైన సంకల్పమే కనిపించిందని పార్టీలతో ప్రమేయం లేని ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు మించే ఈ సారి ఎన్నికల్లో చూడబోతున్నామనే ధీమాతో వైఎస్సార్ సీపీ నేతలున్నారు.

బలపడతాం అంటున్న తెలుగు తమ్ముళ్లు

గత ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు పార్లమెంటు (అరకు పార్లమెంటు స్థానంతో కలిపి) స్థానాలకు నాలుగింటా వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. 19 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ నాలుగు(పెద్దాపురం, మండపేట, రాజమహేంద్రవరం సిటీ, రూరల్), రాజోలు నుంచి జనసేన మినహా 14 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అప్రతిహతమైన విజయాన్ని అందుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెజార్టీ సీట్లు గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారాన్ని చేపడుతుండటాన్ని సెంటిమెంట్‌గా పరిగణిస్తారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో 151 అసెంబ్లీ స్థానాలు, 25కు 22 పార్లమెంటు స్థానాలతో విజయదుందుభి మోగించింది. ఉమ్మడి తూర్పులో ప్రభుత్వానికి సానుకూలత పెరగడంతో దాని ప్రభావం పోలింగ్‌లో కనిపించిందని తలపండిన నేతలు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఏడెనిమిది లక్షలు విలువ చేసే ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి స్థిర ఆస్తికి హక్కుదారులను చేయడం వంటి అంశాలతో మహిళలు జగన్‌కు మద్దతుగా ఓటెత్తారంటున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ గెలుపొందిన పెద్దాపురం, రాజోలు తదితర స్థానాల్లో తమ పార్టీ పాగా వేస్తుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. గత ఎన్నికల కంటే ఈసారి పార్టీ బలపడిందని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. జనసేన, బీజేపీ కూటమి కట్టడం తమకు సానుకూలమైందని చెబుతున్నారు.

2019 ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	వైఎస్సార్ సీపీ	టీడీపీ	జనసేన	మెజార్టీ
తుని	92,443	68,442	6,413	24,016 (వైఎస్సార్ సీపీ)
ప్రత్తిపాడు	77,108	72,492	06,958	4,611 (వైఎస్సార్ సీపీ)
జగ్గంపేట	93,496	70,131	10,617	23,365 (వైఎస్సార్ సీపీ)
పిఠాపురం	83,459	68,467	28,011	14,992 (వైఎస్సార్ సీపీ)
పెద్దాపురం	63,366	67,393	24,894	4,027 (టీడీపీ)
కాకినాడ రూరల్	73,688	64,902	39,247	8,786 (వైఎస్సార్ సీపీ)
కాకినాడ సిటీ	73,890	59,779	30,188	14,111 (వైఎస్సార్ సీపీ))
అమలాపురం	72,003	46,349	45,200	25,654 (వైఎస్సార్ సీపీ)
కొత్తపేట	82,645	78,607	35,833	4,038 (వైఎస్సార్ సీపీ)
మండపేట	66,739	77,271	34,892	10,532 (టీడీపీ)
రామచంద్రపురం	79,518	73,800	18,700	05,718 (వైఎస్సార్ సీపీ)
రాజోలు	49,239	45,592	50,053	00814 (జనసేన)
పి.గన్నవరం	67,373	45,166	36,259	22,207 (వైఎస్సార్ సీపీ)
ముమ్మిడివరం	77,802	72,417	32,983	05383 (వైఎస్సార్ సీపీ)
రాజమండ్రి సిటీ	52,928	83,364	22,981	30,436 (టీడీపీ)
రాజమండ్రి రూరల్	63,762	74,166	42,685	10,404 (టీడీపీ)
రాజానగరం	90,680	58,908	20,847	31,772 (వైఎస్సార్ సీపీ)
అనపర్తి	1,11,169	56,240	12,800	55,208 (వైఎస్సార్ సీపీ)
కొవ్వూరు	79,892	54,644	11,677	25,218 (వైఎస్సార్ సీపీ)
గోపాలపురం	1,11,764	74,324	05,882	36,768 (వైఎస్సార్ సీపీ)
నిడదవోలు	81,001	59,313	23,073	21,688 (వైఎస్సార్ సీపీ)
రంపచోడవరం	98,318	59,122	పోటీలో లేదు	39,196 (వైఎస్సార్ సీపీ)

అందరూ లెక్కల మాస్టర్లే!

ఓట్ల లెక్కింపునకు మరో పక్షం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో దాదాపు ప్రధాన ప్రత్యర్థులు గెలుపుపై ఆశాభవంతో పోలింగ్ సరళి ఆధారంగా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. అభ్యర్థుల మాట అటుంచి ప్రజలు, పార్టీల నేతలు కూడా ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కడైనా నలుగురు కలిస్తే చాలు ఫలితాలపైనే చర్చించుకోవడం కనిపిస్తోంది. ఫలితాల సమయం దగ్గర పడుతున్న కొద్దీ సామాజిక మాధ్యమాల్లో గెలుపు ఓటములపై చర్చోపచర్చలు హోరెత్తిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఎక్కడికక్కడ అభ్యర్థుల గెలుపు, ఓటములకే పరిమితం కాకుండా అభ్యర్థికి వచ్చే ఓట్లు, విజేతకు వచ్చే మెజార్టీ...ఇలా ఎవరికి నచ్చినట్టుగా వారు కూడికలు, తీసివేతలతో బిజీగా కనిపిస్తున్నారు. నాలుగైదు సార్వత్రిక ఎన్నికలలో ప్రత్యక్షంగా పాల్గొని రాజకీయాల్లో తలపండిన నాయకులైతే బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కలు దగ్గర పెట్టుకుని మరీ అంచనాలు తయారు చేసుకుంటున్నారు. ఏ బూత్‌లో ఏ సామాజికవర్గ ఓట్లు ఎన్ని ఉన్నాయి, వాటిలో ఏ సామాజికవర్గం బలంగా మద్దతు ఇచ్చింది, ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి అనే లెక్కలు తీస్తూ ఒక రకంగా అందరూ లెక్కల మాస్టర్లుగా మారిపోతున్నారు.

కృష్ణబాబుకు కన్నీటి వీడ్కోలు

- దొమ్మేరులో ముగిసిన అంతిమ సంస్కారాలు
- నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు
- కడసారి చూపు కోసం భారీగా తరలి వచ్చిన అభిమానులు



దొమ్మేరులో కృష్ణబాబు అంతిమ యాత్ర



మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు (ఫైల్)

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు (71) అంతిమ సంస్కారాలు బుధవారం ఆయన స్వగ్రామమైన కొవ్వూరు మండలం దొమ్మేరులో నిర్వహించారు. గ్రామ శివార్లలోని ఆయన పూర్వీకుల సమాధుల వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణబాబు చిన్న కుమారుడు రవి తలకొరివి పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు తరలివచ్చి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయుడు, మాజీ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, చింతకాయల అయ్యన్నపాత్రుడు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు జొన్నకూటి బాబాజీరావు, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, టీవీ రామారావు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ మాజీ చైర్ పర్సన్ ఇమ్మణ్ణి రాజేశ్వరి, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పార్టీలకు అతీతంగా తరలివచ్చి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కృష్ణబాబు స్వగృహం నుంచి గ్రామ శివారున ఉన్న వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమ యాత్ర కొనసాగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జనం అంతిమ వీడ్కోలు పలికారు. కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ జేఎండీ, కృష్ణబాబు సోదరుడు పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, ఎండి పెండ్యాల అచ్చుత రామయ్యను ప్రముఖులు పరామర్శించారు.

నేత్రపర్వంగా సత్యదేవుని రథోత్సవం

- 36 అడుగుల ఎత్తయిన రథంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు



రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



వెండి రథంపై ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: శ్రీసత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో ఐదో రోజు బుధవారం కొండ దిగువన నిర్వహించిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటల వరకు జరిగిన ఈ రథోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు. సత్యరథాన్ని ఉదయం తొమ్మిది గంటలకు పంపా సత్రం నుంచి తొలిపావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ రథాన్ని రంగురంగుల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం నాలుగు గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను అర్చకస్వాములు ఊరేగింపుగా కొండదిగువన తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగ సుందరంగా అలంకరించిన నూతన రథంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పూజలు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు రథం ముందు కుంభం పోసి గుమ్మడికాయతో అర్చకులు దిష్టి తీశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వందల సంఖ్యలో భక్తులు దేవస్థానం సిబ్బంది, ధవళేశ్వరం నుంచి వచ్చిన రథం నడిపే నిపుణులు రథాన్ని లాగారు. తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ వరకు, అక్కడి నుంచి దేవస్థానం హైస్కూల్ వద్ద గల టోల్‌గేట్ వరకు తిరుగు ప్రయాణంలో మరలా తొలిపావంచా వద్దకు రథోత్సవం కొనసాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను రథం నుంచి కిందకు దించి ఊరేగింపుగా సత్యదేవుని ఆలయానికి చేర్చారు. దేవస్థానం డిప్యూటీ ఈఓ రమేష్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరాజు, ఇంజినీరింగ్ ఈఈలు మురళి, నరసింహారెడ్డి, డీఈలు ఉదయ్, బీఎస్ రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, ఏఈఓలు పాల్గొన్నారు. రథోత్సవంలో మొదట గ్రామస్తులు తక్కువగా ఉన్నా, ఆరు గంటల సమయానికి వేల సంఖ్యలో తరలిరావడంతో అన్నవరం మెయిన్‌రోడ్డు కిక్కిరిసిపోయింది. ఈఓ కె.రామచంద్రమోహన్ రథోత్సవం ప్రారంభం నుంచి చివరి వరకు నాలుగు గంటల పాటు మైకు ద్వారా సిబ్బందికి సూచనలిచ్చారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు భక్తులు, గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కోలాటం, కేరళ డప్పులు, పులివేషాలు అందరినీ ఆకర్షించాయి. సత్యదేవుని రథోత్సవంలో రథానికి విద్యుత్ అలంకరణ చేసినా సాంకేతిక కారణాలతో వెలిగించ లేదు. స్వామి, అమ్మవార్లకు, రథం ముందు ఫోకస్ లైట్లు తప్ప విద్యుత్ అలంకరణ లేదు.



క్లుప్తంగా

రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు



కరిచర్లగూడెం జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

గోపాలపురం: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం నుంచి దేవరపల్లి వెళ్తున్న బ్రెజా కారు గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వెళ్తున్న వేగనార్ కారు కరిచర్లగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. బ్రెజా కారును వేగనార్ కారు బలంగా ఢీకొట్టడంతో కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పడిపోయింది. దీంతో కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు బయటకు తీసి 108 అంబులెన్స్‌లో గోపాలపురం సీహెచ్‌సీకి తరలించారు. వేగనార్‌లో ముందు సీట్లో కూర్చున్న మహిళ కాలికి గాయం అయినట్లు స్థానికులు చెప్పారు. దీనిపై గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేని తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులోని ఐరన్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ హాలులో జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో సుమారు 65 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓపెన్ విభాగంలో సుశాంత్ సాకేత్, కళ్యాణ్ కుమార్, సీతాసాగర్, గోపీకృష్ణలు విజేతలుగా నిలవగా, మహిళల విభాగంలో అక్షయ కరక్, రష్మి, రిషిత, కావ్యశ్రీ విజయం సాధించారు. ఓపెన్ విభాగంలో విజేతలు విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని, మహిళల విభాగంలోని విజేతలు హిందూపురంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని సంఘ కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

కిలో చికెన్ @ ట్రిపుల్ సెంచరీ



- 'ఎగ్'బాకుతున్న ధర
- వేసవి ప్రభావం అంటున్న వ్యాపారులు

రాయవరం/ ఆలమూరు: మాంసాహార ప్రియులకు చేదువార్త ఇది.. కిలో చికెన్ ధర 'ట్రిపుల్' సెంచరీ దాటింది.. గుడ్డు ధరా అంతకంతకూ 'ఎగ్'బాకుతోంది.. మొన్నటి వరకూ ఎండల మంట ఇప్పుడు చికెన్ ధరలపై పడింది. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం కొంత చల్లబడినా ఆ ధరలు పెరుగుతూ పోతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో చికెన్ ధర రూ.300 పలుకుతోంది. పెరిగిన ధరలతో మాంసాహార ప్రియులు అయ్య బాబోయ్ అంటున్నారు. మండుటెండలకు బ్రాయిలర్ కోళ్లు చనిపోవడం, తగినంత దాణా తీసుకోకపోవడం వంటి కారణాలతో కోళ్ల బరువు పెరగలేదు. ఇది చికెన్ ధర పెరగడానికి కారణాలుగా ఫౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. ఫలితంగా కిలో ధర బుధవారం రిటైల్ మార్కెట్లో రూ.300 పలికింది. అదే స్కిన్‌లెస్ అయితే కిలో రూ.320 వరకూ విక్రయించారు. ఇదిలా ఉంటే లైవ్ బర్డ్ కిలో రూ.180 పలుకుతుంది. దీనికితోడు రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7కి చేరింది.



కోళ్లకు వడ'దెబ్బ'

వేసవిలో కోళ్ల ఎండను తట్టుకోలేక.. వడదెబ్బకు చనిపోతుంటాయి. ఎక్కువగా నీళ్ల తాగడం, ఎండ తీవ్రతతో దాణా తినడాన్ని తగ్గించేస్తాయి. దీంతో కోళ్ల బరువుతో పాటు ఎదుగుదల కూడా ఉండదు. అలాగే గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వారం రోజుల కిందటి వరకూ మండిన ఎండలకు ఐదు నుంచి పది శాతం శాతం వరకూ బ్రాయిలర్ కోళ్ల మృత్యువాత పడ్డాయి. మూడు నాలుగు రోజులుగా ఎండల తీవ్రత తగ్గినప్పటికీ ఇప్పటి వరకూ ఉన్న ఉష్ణోగ్రతలు బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ కారణంగానే చికెన్ ధర ఆకాశాన్నంటింది. ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో బ్యాచ్‌లను ఫౌల్ట్రీ యజమానులు రెడీ చేయాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో బ్రాయిలర్ కోడి అందుబాటులోకి రావాలంటే 45 రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకూ ఇదే ధర కొనసాగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే లేయర్ కోళ్ల విషయంలో కూడా ఇదే విధానం కొనసాగనుంది. అధిక ఉష్ణోగ్రతలకు లేయర్ కోళ్ల గుడ్ల ఉత్పత్తి బాగా తగ్గింది. 20 శాతం గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. దీంతో గుడ్డు రేటు కూడా సహజంగానే పెరిగింది. అయినా ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని ఫౌల్ట్రీ వర్గాలు వాపోతున్నాయి. జిల్లాలో 200 వరకూ ఫౌల్ట్రీలు ఉండగా, 1.40 కోట్ల లేయర్ కోళ్ల కెపాసిటీ ఉంది. అధిక ఉష్ణోగ్రతలతో లేయర్ కోళ్లు కూడా మృత్యువాత పడడంతో నష్టాల బారిన పడిన రైతులు ఫౌల్ట్రీల కెపాసిటీని తగ్గించేశారు. దీంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 80-90 లక్షల వరకూ లేయర్ కోళ్లు ఉన్నప్పటికీ గుడ్ల ఉత్పత్తి 60 లక్షలు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా కోళ్లు అందుబాటులో లేకపోవడం, గుడ్ల ఉత్పత్తి పడిపోవడంతో ధరలు పెరిగాయని ఫౌల్ట్రీ యజమాని కర్రి రామారెడ్డి తెలిపారు.

చల్లబడేవరకూ ఇంతే..

వాతావరణం మరింత చల్లబడే వరకూ చికెన్ ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్‌ను బట్టి మరో రూ.50 వరకూ అదనంగా పెరగవచ్చని పేర్కొంటున్నారు. మరోవైపు ధరలు అధికంగా ఉండడంతో మార్కెట్లో చికెన్ అమ్మకాలు కూడా తగ్గిపోయినట్లు వ్యాపారులు వాపోతున్నారు. వేసవి తీవ్రత, ధర పెరుగుదల కారణంగా 15-20 శాతం అమ్మకాలు తగ్గినట్లు అంచనా.

కోడి గుడ్లదీ అదే దారి..

కోడిగుడ్ల ధరలూ పెరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఏప్రిల్ మాసాంతంలో 100 కోడి గుడ్ల ధర వద్ద రైతు వద్ద రూ.350లు ఉండగా, మే 9 నుంచి 100 కోడిగుడ్లు రూ.500కు చేరింది. షాపుల వద్ద ఒక్కో గుడ్డును రూ.6కు విక్రయించేవారు. ఇప్పుడు ఒక్కో గుడ్డు రూ.7కు అమ్ముతున్నారు. చికెన్ ధర ట్రిపుల్ సెంచరీ కొట్టడంతో మాంసాహార ప్రియులకు ధరాఘాతం తగిలినట్లయింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆచితూచి చికెన్ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పనులు లేని రోజుల్లో ఇంత ధరకు చికెన్ ఎలా తినగలమని సామాన్య మాంసాహార ప్రియులు వాపోతున్నారు.



ఉత్పత్తి గణనీయంగా తగ్గింది



వేసవి కాలం నేపథ్యంలో ఫౌల్ట్రీల నుంచి పూర్తి స్థాయిలో కోళ్ల సరఫరా జరగడం లేదు. వేసవిలో అధిక ఉష్ణోగ్రత వల్ల కోళ్లు ఎక్కువగా మృతి చెందడం, రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించడం వల్ల ఒక్కసారిగా చికెన్ కొరత ఏర్పడింది. దీంతో ధరలు రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నా ఎన్ని రోజులు నిలకడగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ కోళ్ల వ్యాపారంలో తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న తమ లాంటి వ్యాపారులకు ప్రస్తుతం పెరిగిన ధర కొంతమేర ఊరటనిస్తుంది.

–బొబ్బా వెంకన్న, హోల్‌సేల్ కోళ్ల వ్యాపారి, పెదపళ్ల

స్వామి వనవిహారం.. శోభాయమానం



సత్యదేవుడు, అమ్మవార్ల వనవిహారోత్సవం నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

- ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు
- కోలాహలంగా అన్నవరం క్షేత్రం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారం సాయంత్రం నవ దంపతులైన సత్యదేవుడు, అమ్మవార్లకు కొండ దిగువన ఉద్యానంలో వనవిహారోత్సవం నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా సత్యదేవుడు, అమ్మవార్లను రత్నగిరి నుంచి ఊరేగింపుగా కొండ దిగువన ఉద్యాన వనంలోని మండపం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ వేదికపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. తొలుత విఘ్నేశ్వర పూజ అనంతరం పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ సమర్పించారు. పూజల అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టిశివ, యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి కామశాస్త్రి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, వైదిక కమిటీ సభ్యుడు ఛామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

శ్రీచక్రస్నానానికి సర్వం సిద్ధం

సత్యదేవుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవునికి శ్రీచక్రస్నానం చేసేందుకు పంపా నది ఒడ్డున కోనేరును సిద్ధం చేశారు. పవర్‌హౌస్ వద్ద పంపా నది గర్భంలో జేసీబీ ద్వారా కృత్రిమంగా కోనేరు తవ్వి అందులోకి దేవస్థానం బోరు నుంచి నీటిని నింపిన విషయం విదితమే. బుధవారం కూడా దేవస్థానం బోర్ల నుంచి పైపుల ద్వారా కోనేరులోకి నీటిని నింపారు. ఈ పనులను ఆలయ ఈఓ రామచంద్రమోహన్ పరిశీలించారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ పంపా నది ఒడ్డున స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం నిర్వహించనున్నారు.

అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3 గంటలు: సుప్రభాతసేవ
ఉదయం 8 గంటలు : చతుర్వేదపారాయణ
ఉదయం 9 గంటలు: కొండదిగువన పంపా నది వద్ద సత్యదేవుడు, అమ్మవారికి శ్రీచక్రస్నానం
సాయంత్రం 4 గంటలు: అనివేటి మండపం వద్ద నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణం, కంకణ విమోచనం
సాంస్కృతిక కార్యక్రమాలు: రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన ఉదయం ఏడు గంటల నుంచి పది గంటలకూ, సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ

40 కాసుల బంగారు ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బెదిరించి సుమారు 40 కాసులు బంగారు ఆభరణాలను దొంగ దోచుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి బొమ్మూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరు గ్రామ పంచాయతీ వీధికి చెందిన కామిని వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు తన కుమారుడు, కోడలితో కలిసి జీవిస్తుంది. మంగళవారం ఉదయం కుమారుడు, కోడలు కలిసి కొవ్వూరు మండలం పెదవాడపల్లి గ్రామంలోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంట్లో వెంకటలక్ష్మి ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మెయిన్ డోర్ పక్కన కిటికీని తొలగించి లోపలకు ప్రవేశించాడు. వృద్ధురాలిని బెదిరించి ఆమె రెండు గాజులను, చేతికి ఉన్న లక్ష్మీదేవి ఉంగరాన్ని లాక్కున్నాడు. బీరువాలోని బంగారం వస్తువులను చోరీ చేసి పరారయ్యాడు. సుమారు 40 కాసుల బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలంలో క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ 1 రూపాయితో మీ ఫ్లాట్ సొంతం చేసుకోండి (100% లోన్) అనకాపల్లి నేషనల్ హైవేకి ఆనుకొని ఉన్న 70 ఎకరాల VMRDA అప్రూవల్ లే అవుట్ నందు ✆ : 99483 23757 [R-1229007]

Services

అమ్మ హోం కేర్ సర్వీస్

■ 24 గంటలు వృద్ధులకు, పేషంట్లకు, బేబికేర్, ఇంటి పని, వంట పనికి అనుభవం గల ఆయా వర్కర్లను మీ ఇంటికి పంపగలం. వరంగల్. సెల్: 8522903927, 9059835761. [W-1242463]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ ఉదయం 6 గం॥లకు వచ్చి రాజమండ్రి మా ల్యాబ్‌లో పనిచేయుటకు ల్యాబ్ అసిస్టెంట్ కావలెను. అనుభవం వున్నవారు సంప్రదించవచ్చును. ✆ : 94416 49955 [R-172]

■ రాజమండ్రి మొగల్ బిర్యానీ ప్యాలెస్ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవం గల కెప్టెన్లు, సప్లయర్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. 9 వేలు పైన జీతం + భోజనం. సంప్ర॥ 85004 31651 [R-6719]

■ కష్టపడేవారు కావలెను VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు ఆయా,నర్సులు,వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 8317512135 [HA-150]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500rs. మీ పేరు, కాల్ / వాట్సప్ చేయగలరు. 9502615217 [G-8890]

■ ప్రముఖ బ్యాంకులలో పర్మినెంట్‌గా కం॥ ఆపరేటర్స్,క్లర్క్స్,అటెండర్స్,ఆఫీస్అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ కా॥ Qly: 10th - డిగ్రీ .జీ॥ 28000/-. ఫోన్: 7981652556 [H-801626]

■ మా కంపెనీ కొరకు 80మంది స్త్రీ,60మంది పురుషులు & టెలికాలర్స్ (F) అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+భోజనం +జీతం: 24,000/- వరకు. డైరెక్ట్ జాబ్, స్పాట్ జాయినింగ్. ఫోన్: 9966310431 [HA-10856]

■ రాజమండ్రి ఓల్డ్ బైపాస్ దగ్గర DMH స్కూల్ దగ్గర ప్రముఖ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డ్స్ లేడీ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను .డ్యూ 12 గం. జీతం: 13000/-, 2 Week off, ESI, PF. ✆ 89783 24567,99859 56778 [B-755720]

■ కాకినాడ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ. 4 వీక్లీ ఆఫ్స్, 26 వర్కింగ్ డేస్. గ్రాస్ శాలరీ : 14,897/- Intime Salary ఆఫీస్ : సిద్ధార్థ నగర్, కాకినాడ. ఫోన్ : 92469 84359, 90001 14053 [V- 823792]

■ శ్రీ NRKA టెక్స్‌టైల్స్ రాజమండ్రిలో పని చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. డ్యూటీ 8 గం॥ జీతం: 7500 నుండి 12000 వరకు & PF, ESI, ఉచిత వసతి, సబ్సిడి భోజనం ఏర్పాటు సంప్ర॥ లాలాచెర్వు జంక్షన్. ✆ : 85009 91230 [R-508]

■ జీతం: రూ.12,000/- లు నుండి రూ.20,000/-లు, టెక్నికల్ స్టాఫ్ కావలెను. అర్హత: I.T.I., డిప్లమో, B.Tech - మెకానికల్ / ఎలక్ట్రికల్ చేసిన అభ్యర్థులు, అనుభవం లేని వారికి ట్రెనింగ్ ఇవ్వబడును. Cont: శ్రీ దేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్: హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 81434 12349 [R-22]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఖననం చేసిన బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం



పారుపాకలో బాలుడి మృతదేహానికి పంచనామా నిర్వహించేందుకు వచ్చిన అధికారులు

రౌతులపూడి: గత నెలలో ఖననం చేసిన బాలుడి మృతదేహానికి బుధవారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి సమక్షంలో ఎస్సై అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఆ వివరాల ప్రకారం.. మార్చి 15న రౌతులపూడి మండలం పారుపాకలో కుశిరెడ్డి శ్రీను వరుసకు మేనల్లుడైన పారుపల్లి సాకేత్ (6)తో కలసి తన మోటారు సైకిల్‌పై రౌతులపూడి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మార్గంమధ్యలో గిడజాం ఇటుక బట్టీల సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పడంతో బాలుడు సాకేత్ రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఆ బాలుడి తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని రౌతులపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి తీసుకెళ్లగా అదేరోజు రాత్రి బాలుడికి ఫిట్స్‌లా వస్తే కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటిరోజు సాకేత్ మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అయితే దీనిపై ఇరు కుటుంబాలు వారు వాగ్వాదాలకు దిగుతున్నారు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి, తండ్రి రాజుబాబులు కాకినాడ ఎస్పీ కార్యాలయంలోని స్పందనలో గత నెలలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఖననం చేసిన మృతదేహానికి పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వైద్యులు శవపరీక్షలు నిర్వహించారు. అనంతరం తిరిగి అక్కడే ఖననం చేశారు. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై అబ్దుల్ నబీ విలేకర్లకు తెలిపారు.

ఏలేరు కాలువలో వ్యక్తి గల్లంతు

రౌతులపూడి: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సీకోలు వీరబాబు బుధవారం ఏలేరు ఎడమ కాలువలో గల్లంతయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సీకోలు వీరబాబు రౌతులపూడిలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. మధ్యాహ్న భోజనం అనంతరం తిరుగు ప్రయాణంలో రౌతులపూడి నుంచి కత్తిపూడి వెళ్లే రహదారిలో రౌతులపూడి శివారున ఏలేరు ఎడమ కాలువ వంతెన వద్ద తన సమీప బంధువులతో కలిసి కాలువలోకి స్నానానికి దిగాడు. కాలువలోకి దిగిన వీరబాబు గల్లంతు కావడంతో స్థానికులు రౌతులపూడిలోని సమీప బంధువులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

'నన్నయ' వర్సిటీకి అయాచిత సెలవులు



'నన్నయ' వర్సిటీ ముఖద్వారం వద్ద స్టాపర్లు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థులకు జూన్ 6 వరకూ అయాచిత సెలువు లభించాయి. సాధారణంగా దసరాకు, వేసవిలో ఎక్కువ రోజులు సెలవులు ప్రకటిస్తారు. అయితే సార్వత్రిక ఎన్నికల పుణ్యమా అని అనుకోని విధంగా యూనివర్సిటీ విద్యార్థులకు నెల రోజులు, బోధన, బోధనేతర సిబ్బందికి మూడు వారాలు సెలవులొచ్చాయి. 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం యూనిట్లను యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాల ఏరియాలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి, పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘాలో నిరంతరం మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఈ ప్రాంతానికి కిలోమీటరు దూరంలో సెక్షన్ 144 (సి), సీఆర్‌పీసీ క్రింద విధులు నిర్వర్తించే అధికారులు మినహా ఇతరులెవ్వరూ గుంపులుగా ఉండటం, సమావేశాలు నిర్వహించడం నిషేధించారు. క్యాంపస్‌ని 'నో మ్యాన్స్ జోన్'గా ప్రకటించిన నేపథ్యంలో ఈ నిషేధాజ్ఞలను ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 188 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు. ఈ విధంగా యూనివర్సిటీ ప్రాంగణమంతా సాయుధ బలగాల ఆధీనంలోకి వెళ్లడంతో ఇతరులెవ్వరూ లోనికి ప్రవేశించేందుకు అవకాశం లేదు. చివరకు యూనివర్సిటీ అధికారులకు కూడా పరిపాలన పరమైన విధులను నిర్వరించేందుకు అనుమతివ్వని నేపథ్యంలో యూనివర్సిటీలో వచ్చే నెల 6 వరకూ బోధన, అడ్మినిస్ట్రేషన్స్ అన్నీ బంద్ చేస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ప్రకటించిన సంగతి విధితమే. స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరచిన ఈవీఎం యూనిట్ల కారణంగా పరిపాలనా పరమైన విధులకు కూడా అధికారులు సెలవు తీసుకోకతప్పలేదు. పక్కనే ఉన్న కాకినాడ జిల్లాలోని జేఎన్‌టీయూకే యూనివర్సిటీ ప్రాంగణంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్స్ ఉన్నాయి. అందుకు కొన్ని భవనాలను కేటాయించి, ఇతర భవనాలలో విద్యార్థుల బోధనతో సహా యూనివర్సిటీ పరంగా జరిగే ఇతర యాక్టివిటీస్ అన్నీ సజావుగా జరుగుతూనే ఉన్నాయి. అయితే ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణమంతా ఎన్నికల అధికారులు స్వాధీనపర్చుకోవడంతో అయాచిత సెలవులు ఇచ్చారు.

బాలిక అదృశ్యం

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలేనికి చెందిన బాలిక (17) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కంసాలిపాలేనికి చెందిన బాలిక ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీంతో తల్లి ఉప్పాటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సొమ్ము నొక్కి.. వలకు చిక్కి..

- ఏసీబీ వలలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం
- రూ.2 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు



లంచం తీసుకుంటూ పట్టుబడిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మురళి

కాకినాడ రూరల్: ఓ అవినీతి అధికారి గుట్టురట్టు అయ్యింది.. లంచం తీసుకుంటూ చివరికి ఏసీబీ వలకు చిక్కాడు. దీనిపై రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రామారావుపేటకు చెందిన పెమ్మాడి శ్రీనివాసకుమార్ 2020-21 మధ్య శ్రీముఖి పేరిట ఐస్ ఫ్యాక్టరీని సర్పవరం ఆటోనగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన తరువాత ఇంటెన్సివ్ సబ్సిడీ విడుదల తప్పుగా నమోదు చేయడంతో జూన్ 2021కు బదులు మే 2021గా సరిదిద్దేందుకు గాను జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మురళిని ఆశ్రయించాడు. దీంతో అతను శ్రీనివాసకుమార్‌ను రూ.2.5 లక్షలు ఇవ్వాలని లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వకపోతే ఐస్ ఫ్యాక్టరీ సీజ్ చేసేలా చేస్తానని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు శ్రీనివాస్‌కుమార్ డీఐసీ కార్యాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నాడు. పని మాత్రం అవ్వలేదు. డబ్బు ఇస్తేగాని పని అవ్వదని, లేకుంటే సబ్సిడీ రాదని భావించిన శ్రీనివాస కుమార్ ఈ నెల 17న రాజమహేంద్రవరంలో ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు చెప్పిన విధంగా బుధవారం ఉదయం నాలుగు ఐదు వందల నోట్ల కట్టలను, స్వీట్ బాక్స్‌ను తీసుకుని రమణయ్యపేట వద్ద కార్యాలయంలో ఇచ్చేందుకు వెళ్లాడు. జీఎం మురళి తీసుకోకుండా సాయంత్రానికి వాయిదా వేశారు. సాయంత్రం మరోసారి అడగడంతో కాకినాడలోని జీఆర్‌టీ హోటల్ వద్దకు రావాలని మురళి సూచించారు. రాత్రి 8.10 గంటల సమయంలో శ్రీనివాస్ కుమార్ నుంచి హోటల్ బయట రోడ్డుపై మురళి కారులో ఉండి సొమ్ము తీసుకుని వెనుక డిక్కీలో ఉంచారు. వెంటనే ఏసీబీ అధికారులు వల పన్ని మురళిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్ము స్వాధీనం చేసుకుని రసాయన పరీక్షలు చేసి నిర్ధారించుకున్నారు. కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖ జీఎం మురళి లంచం తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. శ్రీముఖి ఐస్ ఫ్యాక్టరీ నిర్వాహకుడు శ్రీనివాస్ కుమార్‌కు ప్రభుత్వం నుంచి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ సబ్సిడీ రావాల్సి ఉందని, ఆ సొమ్ము విడుదలకు సహకరించేందుకు రూ.2.5 లక్షలు డిమాండ్ చేసి, రూ.2 లక్షలకు ఒప్పుకున్నాడని అన్నారు. జీఆర్‌టీ హోటల్ వద్ద రూ.2 లక్షలు తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్నామని వివరించారు. రమణయ్యపేటలోని డీఐసీ కార్యాలయానికి నిందితుడిని తీసుకువచ్చి విచారించామన్నారు. అతన్ని అరెస్టు చేసి రామమహేంద్రవరం కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరుస్తామని అన్నారు. ఇదిలాఉంటే మురళి ఇటీవలే వీఆర్‌ఎస్‌కు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడన్నారు. ఈ దాడిలో సీఐలు వాసుకృష్ణ, సతీష్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో చక్కార్లు



రైల్వే స్టేషన్‌లో బ్యాటరీ కారులో వెళ్తున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే స్టేషన్‌లో కార్లు చక్కర్లు కొడుతున్నాయి.. ప్రయాణికులను రయ్ రయ్‌మంటూ రైలు బండి వద్దకు తీసుకెళ్తున్నాయి. ప్రయాణికుల కోసం వీటిని సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రెండు ప్రత్యేక బ్యాటరీ కార్లు వచ్చాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే స్టేషన్లో ప్రయాణికులను స్టేషన్ ముఖ ద్వారం నుంచి ఏ ప్లాట్‌ఫామ్‌కైనా తీసుకు వెళ్లేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. రైలు ఎక్కేందు వెళ్లే, రైలు నుంచి దిగిన ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. రైల్వే స్టేషన్ ఆవరణ నుంచి స్టేషన్‌లో ఏ ప్లాట్‌ఫామ్‌కైనా చేర్చేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. దీనికోసం మనిషికి రూ.50 చొప్పున టిక్కెట్ చెల్లిస్తే చాలు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ వీటిని సిద్ధం చేసింది. కాంట్రాక్టు పద్ధతిలో ఏర్పాటైన ఈ కార్లు 24 గంటలూ సేవలు అందించనున్నాయి. రైల్వే స్టేషన్ ముఖద్వారం నుంచి ఒకటి, రెండు, మూడు, నాలుగు ఐదు ప్లాట్‌ఫామ్ పైకి వెళ్లేందుకు ప్రయాణికులకు ఎంతో సౌలభ్యం కానుంది. కేవలం ప్రయాణికులు మాత్రమే రాకపోకలు సాగించేందుకు కార్లు ఏర్పాటు చేయడంపై అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తదితరులకు ఉపయోగపడుతున్నాయి.